నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చంపాపేట: విద్యుత్ మరమ్మతు పనుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాస్ తెలిపారు. లక్ష్మీనగర్ 33/11 కేవీ విద్యుత్ ఫీడర్ల పరిధిలో మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంట వరకు వినయ్‌నగర్, ఎస్ఎస్ఆర్, బీఎస్ఎన్ఎల్, చంపాపేట, రెడ్డి కాలనీల్లో విద్యుత్ ఉండదన్నారు.

నేడు రైతుబజార్‌కు సెలవు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్ రైతు బజార్‌కు బుధవారం సెలవు ఉన్నందున ఎలాంటి క్రయ విక్రయాలు ఉండవని ఈఓ స్రవంతి తెలిపారు. ప్రతి నెల మూడో బుధవారం రైతు బజార్‌కు సెలవు ఉంటుందని గురువారం యథావిధిగా క్రయవిక్రయాలు కొనసాగుతాయన్నారు.

కులగణనలో అలసత్వం వహించొద్దు

చాదర్‌ఘాట్: కులగణన సర్వేలో ఎన్యుమరేటర్లు అలసత్వం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని డీసీ జయంత్ హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వే రెండో దఫాలో మలక్‌పేట్ సర్కిల్‌లో 5307 కుటుంబాల సర్వే చేయాల్సి ఉందన్నారు. గత మూడు రోజుల నుంచి దాదాపు 972 కుటుంబాల వివరాలు సేకరించినట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన గడువులోని పూర్తిస్థాయిలో సర్వే చేస్తామన్నారు.

మలక్‌పేట్ సర్కిల్‌-6లో అధికారులపై విజిలెన్స్ విచారణ

చాదర్‌ఘాట్: మలక్‌పేట్ సర్కిల్‌-6లో పనిచేస్తున్న కొంతమంది ఉద్యోగులపై గత నెల రోజుల నుంచి విచారణ పేరుతో హడావుడి నెలకొంది. టౌన్‌ప్లానింగ్ ఏసీపీ అధికారిపై అక్రమ నిర్మాణాలు జరుగుతుంటే స్పందించడం లేదని పలువురు మలక్‌పేట్ నుంచి హైదరాబాద్ గ్రేటర్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. వెంటనే సంబంధిత అధికారికి ఫోన్‌చేసి ఏసీపీకి మెమోతో పాటు విచారణ చేయాల్సిందిగా డీసీకి ఆదేశాలు ఇచ్చారు. శానిటేషన్ సూపర్‌వైజర్ అధికారిపై ట్రేడ్ లైసెన్స్ జారీ చేయడంలో అవినీతి జరిగిందని పలువురు ఫిర్యాదులు చేయడంపై కమిషన్ విజిలెన్స్ విచారణకు ఆదేశాలు ఇచ్చారని అధికారులు వెల్లడించారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

చాదర్‌ఘాట్: కుటుంబ కలహాలతో ఉరేసుకుని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై భరత్‌కుమార్ వివరాల ప్రకారం.. ఓల్డ్‌మలక్‌పేట్‌లోని వాహెద్‌నగర్‌కు చెందిన సయ్యద్ ఆజమ్(43), సబాబేగం దంపతులు. వీరికి నలుగురు సంతానం. గత కొన్ని రోజులుగా ఇరువురి నడుమ వివాదం జరుగుతోంది. మనస్తాపానికి గురైన సయ్యద్ ఆజమ మంగళవారం ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకొని మృతి చెందాడు.


బీకేఎస్ గ్రౌండ్‌ను అభివృద్ధి చేస్తా



కాలనీ వాసులతో కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి

వనస్థలిపురం: వనస్థలిపురంలోని బీకేఎస్ గ్రౌండ్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నట్లు వనస్థలిపురం డివిజన్ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం గ్రౌండ్‌లో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. వాకింగ్‌ట్రాక్, చిన్నారుల కోసం ప్లేగ్రౌండ్, పచ్చదనం తదితర అభివృద్ధి పనులను చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. కార్పొరేటర్ వెంట జగదీశ్‌గుప్తా, సాయికిరణ్‌గౌడ్, వీరప్ప, రాంరెడ్డి, రత్నాకర్, భాస్కరరావు, నర్సింహారెడ్డి, బాల్‌రాజ్, వినయ్, హరిబాబు ఉన్నారు.

టైర్ల లోడ్‌తో వెళ్తున్న వాహనానికి మంటలు



మంటలను ఆర్పుతున్న సిబ్బంది

నాగోలు: పాత టైర్ల లోడ్‌తో వెళ్తున్న టాటా మినీ వ్యాన్‌కు మంటలు అంటుకున్నాయి. నాగోలు ఫ్లైఓవర్‌పై రాగానే టైర్లకు మంటలు అంటుకోవడంతో గమనించిన డ్రైవర్ వాహనాన్ని ఫ్లై ఓవర్‌పై నుంచి కిందికి దించి వెళ్లిపోయాడు. అప్పటికే భారీగా మంటలు అంటుకోవడంతో ఇతర వాహనదారులు భయాందోళనకు గురయ్యారు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పేశారు.

అమ్మవారికి మారుబోనం సమర్పణ

మహేశ్వరం: జల్‌పల్లి గరిగుట్ట పెద్దమ్మ అమ్మవారి కల్యాణ ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారికి మారుబోనం సమర్పించారు. ఆలయ ధర్మకర్త విఠల్‌బాబా పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతర సందర్భంగా పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా రాత్రింబవళ్లు కృషి చేసిన కార్మికులను ఈ సందర్భంగా సన్మానించారు. కార్యక్రమంలో కిశోర్, ప్రవీణ్, శానిటేషన్ సూపర్‌వైజర్ బుడుమాల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ పార్కింగ్‌కు.. అడ్డాగా ఫుట్‌పాత్‌లు

● కుంచించుకుపోతున్న సర్వీస్ రోడ్లు ● రాకపోకలకు ఇబ్బందులు



ఎల్‌బీనగర్ మెట్రో స్టేషన్ వద్దనున్న సర్వీస్ రోడ్డులో ఆటోల తిష్ట



ద్విచక్ర వాహనాల పార్కింగ్ ఇలా..

లింగోజిగూడ: ఎల్‌బీనగర్ మెట్రో స్టేషన్ సమీపంలో అక్రమ పార్కింగ్‌లతో ట్రాఫిక్ సమస్యలు జఠిలమవుతున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వారితో ఉదయం సాయంత్రం ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతుంటాయి. ఎల్‌బీనగర్ మెట్రో నుంచి వివిధ పనుల నిమనిత్తం నగరంలోకి వెళ్లే వారు తమ వాహనాల అక్కడే పార్కింగ్ చేసి మెట్రో ఎక్కి వెళ్లిపోతుంటారు. పార్కింగ్‌పై పర్యవేక్షణ లేకపోవడంతో ఇష్టానుసారంగా వాహనాలు నిలుపుతుండటంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది. ప్రతిరోజ వేల సంఖ్యల్లో ఎల్‌బీనగర్ మెట్రో ద్వారా నగరంలో వివిధ ప్రాంతాలకు వెళ్తుంటారు. ఎల్‌బీనగర్, బీఎస్‌రెడ్డినగర్, వనస్థలిపురం, హయత్‌నగర్, మన్సూరాబాద్, తుర్కయంజాల్ పెద్దంబార్‌పేట్, నాగోలు, కర్మన్‌ఘాట్ ఇతర ప్రధాన ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. ఇందులో చాల మంది ద్విచక్ర వాహనాలనే వినియోగిస్తుండటంతో ఎల్‌బీనగర్ మెట్రో స్టేషన్ కింద పార్కింగ్ చేస్తుంటారు.

సర్వీస్ రోడ్డుకు ఇరువైపులా..

ఎల్‌బీనగర్ మెట్రో వద్ద సర్వీస్ రోడ్లకు ఇరు వైపులా ద్విచక్ర వాహనాలను పార్కింగ్ చేసి వెళ్లిపోతుండడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.సర్వీస్ రోడ్లతో పాటు పలు కాలనీల అంతర్గత రోడ్లలో కూడా పలువురు పార్కింగ్ చేసి వెళ్లిపోతుండడంతో తమ సొంత వాహనాలు పార్కింగ్ చేసుకోలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నామన్నారు.తమ ఇంటి వద్ద పార్కింగ్ చేయవద్దని ప్రయాణికులకు చెబితే గొడవకు దిగుతున్నారని స్థానికులు వాపోతున్నారు. అందుకే ఇంటి చుట్టూ కర్రలు, రాళ్లను అడ్డు పెట్టాల్సి వస్తుందని వాపోతున్నారు. ఎల్‌బీనగర్ మెట్రో స్టేషన్ వద్ద ప్యాసింజర్ ఆటోలతో తీవ్రమైన సమస్యలు తలెత్తుతున్నాయి. ప్యాసింజర్ ఆటోలు మెట్రో స్టేషన్ వద్ద అడ్డగోలు పార్కింగ్ చేస్తుండడంతో ప్రయాణికులతో పాటు స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.

ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు..

ఎల్‌బీనగర్ మెట్రో స్టేషన్ వద్ద ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌లు కనిపించకుండా పోతున్నాయి.ఫుట్‌పాత్‌లపై పలువురు వ్యాపారాలు నిర్వహిసుండగా, కొందరు హోటల్ యజమానులు ఫుట్ పాత్‌లను తొలగించి పార్కింగ్ స్థలాలుగా ఏర్పాటు చేసుకున్నారు.దీంతో ప్రయాణికులు రోడ్లపైనే నడవాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. వెంటనే పోలీసులు, జీహెచ్ఎంసీ అధికారులు స్పందించి ఫుట్‌పాత్‌లపై ఉన్న వ్యాపారాలను తొలగించాలని కోరుతున్నారు. ప్రయాణికుల సమస్యలే తమకు ఆదాయం అని అక్రమ పార్కింగ్ యార్డులు ఏర్పాటు దారులు అంటున్నారు. ఇదే అదనుగా పలువురు కాలనీల్లో అంతర్గంతంగా ఉన్న ఖాళీ ప్లాట్లలలో ద్విచక్ర వాహనాల పార్కింగ్ యార్డులను ఏర్పాటు చేసి వసూళ్లు చేస్తున్నారు.కాలనీలో ఏర్పాటు చేయడంతో పాటు తాము ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. పోలీసులకు మాముళ్లు ముడుతున్నాయని అందుకే అటువైపు కూడా చూడడం లేదని ఆరోపిస్తున్నారు.

సిబ్బందిని ఏర్పాటు చేయాలి..

ఎల్‌బీనగర్ మెట్రో స్టేషన్ వద్ద ట్రాఫిక్ సిబ్బందిని నియమించాలి. అడ్డగోలుగా వాహనాలు పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలి. ఆటోవాలలను కట్టడి చేయాలి లేకపోతే భవిష్యత్‌లో మరింత సమస్యలు తలెత్తే అవకాశం ఉంది.ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్ఎంసీ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలి.

– స్వప్న, ఎల్‌బీనగర్ ఓల్డ్ విలేజ్

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి



పనుల ప్రారంభోత్సవంలో పాల్గొన్న కొప్పుల నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: డివిజన్‌లో జరిగే అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి సూచించారు. హయత్‌నగర్ పరిధి కొలను శివారెడ్డినగర్ కాలనీలో నూతనంగా చేపడుతున్న భూగర్భ డ్రైనేజీ పనులను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. భవిష్యత్‌లో ఇబ్బందులు తలెత్తకుండా డ్రైనేజీ లెవల్స్ కచ్చితంగా పాటించాలన్నారు. కాలనీవాసులు అభివృద్ధి పనులను పర్యవేక్షించుకోవాలని కోరారు. కాలనీలో మిగిలి ఉన్న పనులకు నిధులు మంజూరు చేయించి పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కొలను నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, యాదిరెడ్డి, మధుసూధన్, వెంకటేష్ నాయకులు పాతూరి శ్రీధర్‌గౌడ్, కడారి యాదగిరియాదవ్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవు



అక్రమ నిర్మాణాలు కూల్చివేసిన దృశ్యం

లింగోజిగూడ: రోడ్డు కబ్జా చేసి నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని జీహెచ్ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్, లింగోజిగూడ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి హెచ్చరించారు.కర్మన్‌ఘాట్ ప్రధాన రహదారిలో నూతనంగా నిర్మించిన అపార్ట్‌మెంట్ల సముదాయం వద్ద రోడ్డును కబ్జాచేసి చెట్లు పెట్టేందుకు నిర్మాణాలు చేపట్టారు. ఈ విషయం స్థానికులు కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి దృష్టికి తీసుకురావడంతో జీహెచ్ఎంసీ అధికారులు సహకారంతో నిర్మాణాలను తొలగించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కర్మన్‌ఘాట్ ప్రధాన రహదారిలో భవిష్యత్‌కు అనుగుణంగా అధికారులు అనుమతులు ఇస్తున్నారని అనుమతుల ప్రకారం నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

విద్యార్థులకు చాక్లెట్లు పంచితే హెచ్‌ఎంను సస్పెండ్ చేస్తారా?



సమావేశంలో మాట్లాడుతున్న సత్యంచారి, పద్మానాయక్

హస్తినాపురం: తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టిన రోజు వేడుకల సందర్భంగా నందనవనం కాలనీలో రోడ్డుపై కేక్‌కట్ చేసి కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో మొక్కలు నాటి విద్యార్థులకు చాక్లెట్లు పంపిణీ చేస్తే ఆ పాఠశాల హెచ్‌ఎంను సస్పెండ్ చేయడం ఎంత వరకు సమంజసమని హస్తినాపురం డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఆండోజు సత్యంచారి, మాజీ కార్పొరేటర్ రమావత్ పద్మానాయక్ ప్రశ్నించారు. మంగళవారం హస్తినాపురం డివిజన్ పరిధిలోని జిల్లా పరిషత్ రోడ్డులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ వ్యక్తిగతంగా చాలా మంచివారని ఆమె పీఏ చంద్రశేఖర్‌రెడ్డి కావాలని డివిజన్‌లో రాజకీయాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో నాయకులు నారగోని శ్రీనివాస్‌యాదవ్, మాజీ అధ్యక్షుడు గోదల రఘుమారెడ్డి, సయ్యద్, రమావత్ శ్రీనివాస్‌నాయక్ పాల్గొన్నారు.

క్యాట్ ఒలింపియాడ్ పరీక్షలో ప్రతిభ



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం

చైతన్యపురి: ఇటీవల నిర్వహించిన క్యాట్ ఒలింపియాడ్ పరీక్షల్లో వీవీనగర్‌లోని పాణినీయ మహా విద్యాలయ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు ప్రిన్సిపల్ ఉషారాణి తెలిపారు. 6–10 తరగతుల 73 మంది విద్యార్థులు పాల్గొనగా 11 మంది ప్రైజ్‌మనీ, 38 మంది మెడల్స్, మెరిట్ సర్టిఫికెట్లు సాధించారన్నారు. మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో రవికుమార్, నాగేశ్వరరావు,జ్యోతి పాల్గొన్నారు.

హాస్టళ్లలోని సమస్యలు పరిష్కరించాలి

నాగోలు: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లలోని సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్సీ స్టూడెంట్ హాస్టల్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షులు కుమార్, ఇతర సభ్యులు మంగళవారం రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జిల్లెల చిన్నారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖలో ఉన్న పోస్ట్ మెట్రిక్ హాస్టల్స్ (210) కాలేజీ హాస్టల్స్, ప్రీ మెట్రిక్ హాస్టల్స్ (670) స్కూల్ హాస్టల్స్‌లలో ఉన్న సమస్యలపై గతంలో జీవోలను ప్రభుత్వం ద్వారా సాధించడం జరిగిందని కాని ఇప్పుడు ఉన్న పరిస్థితులలో జీవోలను పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదన్నారు. గతంలో జారీ చేసిన జీవోలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని కోరారు.

కులగణన రీసర్వేలో అందరూ పాల్గొనండి



కులగణన వివరాలు తెలుసుకుంటున్న రాపోలు జయప్రకాష్

దిల్‌సుఖ్‌నగర్: కులగణ రీసర్వేలో అందరూ పాల్గొనాలని బీసీ కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాష్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆర్కేపురం డివిజన్‌లోని పలు కాలనీల్లో ఆయన పర్యటించి గతంలో కులగణనలో పాల్గొనని వారిని కలిసి ఈ సారి వివరాలు ఇవ్వాలని కోరారు. కులగణన సర్వేపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలో నిజం లేదని కొంత మంది ఉద్దేశపూర్వకంగానే సర్వేలో పాల్గొనలేదన్నార. కులగణన సర్వేను సమగ్రంగా నిర్వహించేందుకు బీసీ కమిషన్ చిత్తశుద్ధితో పనిచేస్తుందని అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి సర్వేలో పాల్గొనేలా ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పున్న గణేష్ నేత, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ సభ్యులు బండి మధుసూదన్ రావు, గట్ల రవీంద్ర, తల్లాటి రమేష్ నేత, శివ, ధనరాజ్ గౌడ్, గుండా నరసయ్య, జల్లా జగన్నాథం, దోర్నాల చంద్రమౌళి, దుర్గాప్రసాద్, ఆనంద్ కుమార్, ఇమ్రాన్, శ్రీశైలం పాల్గొన్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్‌లోని కుర్తాళ పీఠం శ్రీ ప్రత్యంగిరా దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుర్తాళ పీఠ ఆస్థాన పండితులు బ్రహ్మశ్రీ మాచవోలు రమేష్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారు పసుపు కుంకుమ అలంకరణలో దర్శనమిచ్చారు. దేవాలయ ప్రాంగణంలో మహిళల సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. పూజల్లో మునిపల్లె శ్రీనివాస్, మునిపల్లె సువర్ణ లత, విఠల్ శర్మ, హేమంత్ శర్మ, శ్రీపతి, అన్నపూర్ణ, హేమ, దేవి, హిమబిందు పాల్గొన్నారు.

నేడు అన్నాభిషేకం..

దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రత్యంగిరా అమ్మావారికి అన్నాభిషేకం, పల్లకి సేవ నిర్వహిస్తున్నట్లు ఆలయ సెక్రటరీ మునిపల్లె శ్రీనివాస్ తెలిపారు.





ప్రత్యేక అలంకరణలో ప్రత్యంగిరా దేవి, సామూహిక కుంకుమార్చనలో మహిళలు

పల్లవి స్కూల్‌లో ఘనంగా కార్నివాల్



బడంగ్‌పేట్: తిరుమలగిరిలోని పల్లవి మోడల్ స్కూల్లో కార్నివాల్‌ను మంగళవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఫుడ్, గేమ్, స్టార్ట్ ఆఫ్ స్టాల్స్‌ను ఏర్పాటు చేసి సందడి చేశారు. విద్యార్థులు సొంతంగా తయారుచేసిన స్టాళ్లను స్కూల్ డైరెక్టర్ డా.ఎస్.కార్తీక్ సందర్శించి అభినందించారు. అలాగే రెట్రో–థీమ్ ర్యాంప్ వాక్ గ్లామర్, స్టైల్ అందరినీ ఆకట్టుకుంది. దేశంలోని పలు రాష్ట్రాల్లో ఉన్న వంటకాలను విద్యార్థులు అందుబాటులో ఉంచి అలవాట్లు, అభిరుచులు, దేశభాషలు కట్టుబట్లను స్టాళ్లల్లో అందుబాటులో ఉంచారు. కార్నివాల్ అనేది వినోదం, ఆవిష్కరణల సమ్మేళనం అని నిర్వాహకులు అన్నారు.

తప్పుడు వార్తలు రాసే వారిపై చర్యలు తీసుకోవాలి



డీసీపీ ప్రవీణ్‌కుమార్‌కు ఫిర్యాదు చేస్తున్న దేవిరెడ్డి సతీష్‌రెడ్డి

నాగోలు: తనపై సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు రాసే వారిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి మాజీ పీఏ దేవిరెడ్డి సతీష్‌రెడ్డి మంగళవారం ఎల్‌బీనగర్ డీసీపీ ప్రవీణ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనపై సోషల్ మీడియా వస్తున్న వార్తలను ఖండిస్తున్నాని నేను ఎక్కడికి వెళ్లలేదని హైదరాబాదులోనే ఉన్నానన్నారు. రాజకీయాలలోనే ఉన్నత విలువలు కలిగిన నాయకుడిగా పేరున్న రాజగోపాల్ రెడ్డి దగ్గర గత 16 ఏళ్లుగా పని చేస్తున్న నేను రాజగోపాల్ రెడ్డి కానీ.. నా కుటుంబానికి కానీ మచ్చ తెచ్చే పని చెయ్యలేదన్నారు. కొన్ని సోషల్ మీడియా వేదికలు బాధ్యతారాహిత్యంగా ప్రచారం చేసిన వార్తలతో నేను నా కుటుంబ సభ్యులు మనోవేదనకు గురవుతున్నామన్నారు.

రంగరాజన్‌పై దాడిని ఖండిస్తున్నాం



కార్యక్రమంలో పాల్గొన్న వేదపండితులు

మన్సూరాబాద్: హిందూ ధర్మంలో విద్వేషానికి తావులేదని, చిలుకూరి బాలాజీ ఆలయ ప్రధాన అర్చకులు రంగరాజపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని హిందూస్ ఫర్ ప్లూరలిటీ అండ్ ఈక్వాలిటీ జాతీయ ప్రధాన కార్యదర్శి రమణమూర్తి అన్నారు. ఎల్‌బీనగర్ సూర్యోదయనగర్‌కాలనీలోని జైభారత్ ప్రధాన కార్యాలయంలో మంగళవారం వేదవాదం –శాంతినాదం వేద సూక్తుల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బహుళత్వానికి, సమానత్వానికి, ద్వేష రహిత్యానికి హిందూ ధర్మం పెద్దపీట వేస్తుందని పేర్కొన్నారు. రంగరాజపై దాడికి పాల్పడ్డ నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో విజయశంకర్‌స్వామి, రజనీకుమార్, యడ్లపల్లి మోహన్‌రావు, త్రినాథ్, ఉమారాణి, నర్సింహాచార్యులు, సాధు త్రినాథ్, సుబ్రహ్మణ్యశర్మ, లక్ష్మీనారాయణశర్మ, శరత్‌శర్మ, దత్తాత్రేయశర్మ, గౌరీశంకర్ శర్మ, వసుధాశర్మ పాల్గొన్నారు.

పది పరీక్షలకు సన్నద్ధం

వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రణాళిక

- ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు
- ప్రత్యేక తరగతుల్లో విద్యార్థులకు అల్పాహారం



ప్రత్యేక తరగతిలో చదువుతున్న విద్యార్థులు



విద్యార్థులకు అల్పాహారం అందజేస్తున్న దృశ్యం

మీర్‌పేట: పదిలో వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.. వారాంతంలో ప్రాక్టీస్ టెస్టులు పెడుతూ విద్యార్థులు మంచి ఫలితాలు రాబట్టేందుకు కృషి చేస్తున్నారు.. మీర్‌పేటలోని జిల్లెలగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు. జిల్లాలోనే అత్యధిక సంఖ్య విద్యార్థులు ఉన్న పాఠశాల కావడంతో పాటు ప్రతి సంవత్సరం 80 శాతానికిపైగా ఉత్తీర్ణత సాధిస్తుండడంతో ఈ సంవత్సరం వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ఉపాధ్యాయులు విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నారు. అన్ని సబ్జెక్టుల్లో పట్టు సాధించేలా మెలకువలు నేర్పిస్తూ, విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తున్నారు.

సులువుగా అర్థమయ్యేలా..

జిల్లెలగూడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మొత్తం 1151 మంది విద్యార్థులు ఉండగా.. పదో తరగతిలో 227 మంది ఉన్నారు. వీరందరికీ ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు కొనసాగిస్తున్నారు. 10వ తరగతి విద్యార్థులకు ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, అదే విధంగా సాయంత్రం 4.15 నుంచి 5.15 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఒక్కోరోజు ఒక్కో సబ్జెక్టుపై విద్యార్థులకు పాఠాలు చెబుతూ కఠినమైన సబ్జెక్టుల్లోని అంశాలు సులువుగా అర్థమయ్యేలా మెలకువలు నేర్పిస్తూ సాధన చేయిస్తున్నారు. చదువుల్లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టి చదివించడంతో పాటు చురుకుగా ఉన్న వారిని గ్రూపులుగా చేసి పరీక్షల్లో ఎక్కువ మార్కులు సాధించేలా శిక్షణ ఇస్తున్నారు. సాయంత్రం ప్రత్యేక తరగతుల్లో విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్నామని ఉపాధ్యాయులు తెలిపారు.

ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు

విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ప్రత్యేక తరగతుల ద్వారా అన్ని సబ్జెక్టుల్లో పట్టు సాధించేలా బోధన చేయడంతో పాటు కఠినమైన ప్రశ్నలకు ఎలా సమాధానాలు రాయాలో మెలకువలు నేర్పిస్తున్నారు. పరీక్షలు దగ్గరవుతున్న వేళ ఒత్తిడిని అధిగమించేందుకు ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నారు. అదే విధంగా ప్రత్యేక తరగతుల సందర్భంగా రోజుకో విధమైన అల్పాహారం అందజేస్తున్నారు.

– కుసుమలత, 10వ తరగతి విద్యార్థిని

మెలకువలు నేర్పిస్తున్నాం



పరీక్షల్లో వచ్చే ముఖ్యమైన చాప్టర్లపై విద్యార్థులతో ప్రతీ రోజు ప్రాక్టీస్ చేయిస్తున్నాం. ప్రత్యేకంగా నోట్ చేసిన ప్రశ్నపై విద్యార్థులతో చర్చ నిర్వహించి దాన్ని ఎలా సాధన చేయాలో నేర్పిస్తున్నాం. పరీక్షల్లో కఠినంగా వచ్చే ప్రశ్నలను సులువుగా ఎదుర్కొనేలా మెలకువలు నేర్పుతున్నాం.

– నామాల మురళీకాంత్, గణిత ఉపాధ్యాయుడు

వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యం



పది పరీక్షల్లో మండలంలో వందశాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. గణితం, ఇంగ్లిష్, సైన్స్ సబ్జెక్టుల్లో విద్యార్థులు పట్టు సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతుల్లో మెలకువలు నేర్పిస్తూ పరీక్షలకు సిద్ధం చేస్తున్నారు.

– కృష్ణయ్య, మండల విద్యాధికారి